క్లుప్తంగా

ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న సీఎఫ్‌ఎల్ ఫీల్డ్ ఇన్‌చార్జి వెంకటేష్

ఆమదాలవలస రూరల్: ఆర్థిక అక్షరాస్యతతో కుటుంబం అభివృద్ధి బాటలో నడుస్తోందని యూనియన్ బ్యాంక్ సీఎఫ్‌ఎల్ ఫీల్డ్ ఇన్‌చార్జి చిగురుపల్లి వెంకటేష్ అన్నారు. మండలంలోని అక్కులపేట గ్రామంలో ఆర్థిక అక్షరాస్యతపై మంగళవారం అవగాహన సదస్సు నిర్వహించారు. కుటుంబంలో ఉన్న సభ్యులు పొదుపు చేయడం వల్ల భవిష్యత్ అవసరాలకు ఆసరాగా నిలుస్తోందన్నారు. పొదుపు చేయడం ప్రతి ఒక్కరూ అలవాటు చేసుకుంటే అనవసర ఖర్చులు తగ్గి కుటుంబానికి ఎంతో ఆసరాగా ఉంటుందన్నారు. బ్యాంకుల్లో ప్రభుత్వ బీమా పథకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఏటీఎం కార్డు వినియోగాలు, డిజిటల్ మోసాల గురించి వివరించారు. ఫీల్డ్ అసిస్టెంట్ పేడాడ కల్యాణి, ఉపాధి వేతనదారులు పాల్గొన్నారు.

ఔదార్యం..



చంద్రరావు భార్యకు ఆర్థిక సాయం అందజేస్తున్న భగత్ సింగ్ ట్రస్టు సభ్యులు

కొత్తూరు: మండల కేంద్రానికి చెందిన రుగడ సత్యం పక్షవాతంతో బాధపడుతున్నారు. భార్య సూరీడు కూలి పనులు చేసుకుంటూ కుటుంబాన్ని పోషిస్తోంది. ఈ నిరుపేద కుటుంబానికి మంగళారం మండలంలోని కుంటిభద్ర గ్రామానికి చెందిన భగత్‌సింగ్ ట్రస్టు సభ్యులు వెళ్లి రూ.15వేలు అందజేశారు. అలాగే మండలంలోని నేతాజీ నగర్ కాలనీకి చెందిన సున్నాయిలు చంద్రరావు రెండు నెలల క్రితం మృతి చెందాడు. ముగ్గురు పిల్లలతో కుటుంబాన్ని భారంగా నడుపుతున్న మృతుడి భార్యకు రూ.15 వేలు అందజేశారు. ట్రస్టు సభ్యులు లోకేష్, జగది తదితరులు పాల్గొన్నారు.

తాగునీరు సరఫరా



తాగునీటిని సరఫరా చేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

హిరమండలం: పాత హిరమండలంలో గ్రామ దేవత నీలమణి అమ్మవారి పండగల నేపథ్యంలో మంగళవారం మూడు ట్యాంకర్ల ద్వారా తాగునీటిని సరఫరా చేశారు. పండగల ముగింపు నేపథ్యంలో ప్రతీఇంటా విందులు ఏర్పాటు సందర్భంగా తాగునీటికి ఎద్దడి లేకుండా సరఫరా చేస్తున్నట్లు వైఎస్సార్‌సీపీ నాయకుడు మీసాల వెంకటరామకృష్ణ, పీఏసీఎస్ అధ్యక్షుడు తెలిపారు.

పాలిటెక్నికల్ మోడల్ పరీక్షకు విశేష స్పందన



పాలిటెక్నికల్ మోడల్ పరీక్ష రాస్తున్న విద్యార్థులు

ఎల్.ఎన్.పేట: మండలంలోని తురకపేట సెంటర్‌లో ఉన్న ఠాగూర్ ఎడ్యుకేషనల్ అండ్ సర్వీస్ సొసైటీ కార్యాలయం వద్ద మంగళవారం నిర్వహించిన పాలిటెక్నికల్ మోడల్ పరీక్షకు 40 మంది విద్యార్థులు హాజరయ్యారని సంస్థ అధ్యక్షుడు పెద్దకోట వెంకటరావు అన్నారు. ఈ నెల 10న ప్రభుత్వం పాలిటెక్నికల్ ప్రవేశ పరీక్ష నిర్వహిస్తున్నందున ముందస్తుగా మోడల్ పరీక్ష నిర్వహించామఅన్నారు. విద్యార్థులకు పరీక్ష అంటే భయం పోగొట్టి, మెలుకవలు నేర్పించామన్నారు. సంస్థ కార్యదర్శి డి.సుజాత పర్యవేక్షించారు.

విద్యా కానుక కిట్లు పరిశీలన



విద్యాకానుక కిట్లును చూపిస్తున్న ఎంఈఓ రాంబాబు

హిరమండలం: ప్రభుత్వ పాఠశాలలు ప్రారంభం రోజునే విద్యార్థులకు విద్యాకానుక కిట్లు అందించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు ఎంఈఓ కె.రాంబాబు తెలిపారు. స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన జగనన్న విద్యా కానుకల స్టాక్ పాయింట్‌ను పరిశీలించారు. నోట్, పాఠ్యపుస్తకాలు యూనిఫాం, రాగిజావ తాగేందుకు స్టీల్ గ్లాసులు మంగళవారం వచ్చాయన్నారు. హిరమండలం ప్రభుత్వ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం యు.ఎస్.ఎన్.మూర్తి, సీఆర్పీలు, ఎమ్మార్సీ సిబ్బంది ఉన్నారు.

అభివృద్ధిలో ఆంధ్రప్రదేశ్ అగ్రస్థానం



మాట్లాడుతున్న స్పీకర్ తమ్మినేని సీతారాం

- గోనెపాడు సచివాలయాన్ని ప్రారంభించిన స్పీకర్ తమ్మినేని సీతారాం

సరుబుజ్జిలి: రాష్ట్రాన్ని అగ్రపీఠంలో నడిపిస్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గొప్ప విజనరీ ఉన్న నాయకుడని స్పీకర్ తమ్మినేని సీతారాం కొనియాడారు. మండలంలోని గోనెపాడు గ్రామ సచివాలయం భవనాన్ని మంగళవారం ప్రారంభించారు. ప్రజల అవసరాలకు అనుగుణంగా అన్ని సదుపాయాలు కల్పిస్తున్నామని తెలిపారు. మతలబుపేట సచివాలయంలో గోనెపాడు ఉండడం వల్ల ఆశించిన స్థాయిలో సేవలు అందడంలేదని ప్రజలు తన దృష్టికి తెచ్చిన వెంటనే సీఎం జగన్ నుంచి అనుమతులు తెచ్చి గోనెపాడుకు సచివాలయం మంజూరు చేసినట్లు వెల్లడించారు. ప్రజల ముంగిటికే సేవలు అందించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం ఏర్పాటు చేసిన సచివాలయం వ్యవస్థ సత్ఫలితాలను ఇస్తోందని సంతోషం వ్యక్తంచేశారు. ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు, చేపట్టిన అభివృద్ధి పనులపై ఆరాతీశారు. సచివాలయం సిబ్బందిని పిలిపించి, సేవలు అందుతున్న తీరుపై ప్రజల నుంచి అభిప్రాయాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ప్రజల నుంచి వచ్చిన పలురకాల వినతుల స్వీకరించి, అధికారులతో చర్చించి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సీఎం కొత్తగా ప్రవేశపెట్టిన జగనన్నకు చెబుదాం కార్యక్రమం ద్వారా మీ సమస్యలను 1902 టోల్‌ఫ్రీ ద్వారా తెలియజేయాలని సూచించారు. ముఖ్యమంత్రి నేరుగా ప్రజలతో మమేకమై సమస్యలకు పరిష్కారం చూపించడం జరుగుతుందన్నారు. మండల ప్రత్యేకాహ్వానితుడు కిల్లి వెంకటగోపాల సత్యనారాయణ, జెడ్పీటీసీ సురవరపు నాగేశ్వరరావు, వైస్ ఎంపీపీ లావేటి అనిల్‌కుమార్, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ బెవరమల్లేశ్వరరావు, కొత్తకోట పీఏసీఎస్ చైర్మన్ కొవిలాపు చంద్రశేఖర్, రాష్ట్ర ఎస్సీ కార్పొరేషన్ డైరెక్టర్ ఎడ్ల ఈశ్వరరావు, జిల్లా బీసీ సెల్ అధ్యక్షుడు మూడడ్ల రమణ, స్థానిక సర్పంచ్ బిర్లంగి అమ్మాయమ్మ, పార్టీ నాయకులు మామిడి తిరుపతిరావు, బిర్లంగి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలపై ప్రత్యేక దృష్టి



జగనన్నకు చెబుదాంను వీక్షిస్తున్న నాయకులు, అధికారులు

పోలాకి: క్షేత్రస్థాయిలో మౌలికవసతులు, ప్రజల వినతులపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నామని మండల పరిషత్ సలహాదారు ముద్దాడ బైరాగినాయుడు అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో జగనన్నకు చెబుతాం లైవ్ కార్యక్రమానికి పార్టీ నాయకులు, అధికారులతో కలిసి మంగళవారం హాజరయ్యారు. అనంతరం ఏర్పాటుచేసిన సమీక్ష సమావేశంలో పలువురి ప్రజాప్రతినిధుల వినతులపై బైరాగినాయుడు స్పందించారు. ప్రాధాన్యతా క్రమంలో పనులు చేపట్టేందుకు మండల పరిషత్ నిధుల తోపాటు ఎమ్మెల్యే అభివృద్ధి నిధులు సైతం ప్రణాళికాబద్ధంగా వినియోగిస్తున్నట్లు తెలిపారు. ఇప్పటికే పలుచోట్ల పనులకు అంచనాలు సైతం సిద్ధమైనట్లు ఇన్‌చార్జి ఎంపీడీవో ప్రకాశరావు తెలిపారు. వైఎస్సార్‌సీపీ మండల కమిటీ అధ్యక్షుడు కణితి కృష్ణారావు, నాయకులు రెంటికోట త్రినాథరావు, చింతాడ ఉమామహేశ్వరరావు, వ్యవసాయశాఖ అధికారి చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

జగనన్నకు చెబుదాం వీడియో కాన్ఫరెన్స్



పాతపట్నం: వీడియా కాన్ఫరెన్స్‌లో సీఐలు, పోలీస్ సిబ్బంది

పాతపట్నం: ప్రజాల సమస్యల పరిష్కారం కోసం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి జగనన్నకు చెబుదాం (1902 ఫోన్ కాల్) కార్యక్రమాన్ని మంగళవారం ప్రారంభించారు. మండల పరిషత్ కార్యాలయంలో సీఐ ఎం.వినోద్ బాబు, ఎస్‌ఈబీ సీఐ వై.లక్ష్మునాయుడు, ఎస్‌ఐ ఎస్.కామేశ్వరరావు తదితరులు సీఎం ప్రసంగాన్ని వీడియో కాన్ఫరెన్స్ ద్వారా తిలకించారు. ప్రభుత్వ సేవలకు సంబంధించిన 1902 కాల్ చేస్తే సమస్య పరిష్కారం అవుతుందని సీఐ వినోద్ కుమార్ తెలిపారు.

గ్రామ పండగలకు సహకరించాలి



మాట్లాడుతున్న ఎంపీపీ దోర సావిత్రమ్మ

పాతపట్నం: పాతపట్నం నీలమణిదుర్గ అమ్మవారి పండగలు త్వరలో నిర్వహించనున్నామని, తాగునీరు, విద్యుత్ లైట్లు, పారిశుద్ధ్య పనులు చేపట్టాలని, పండగలకు అధికారులు పూర్తిస్థాయిలో సహకరించాలని ఎంపీటీలు కోరారు. మండల పరిషత్ కార్యాలయంలో సర్వసభ్య సమావేశం ఎంపీపీ దొర సావిత్రమ్మ అధ్యక్షతన మంగళవారం నిర్వహించారు. మండలంలో ఇంతవరకు జగనన్న కాలనీలు మంజూరు చేయలేదని పలువురు ఎంపీటీలు సభ దృష్టికి తీసుకెళ్లారు. హౌసింగ్ ఏఈ భాస్కరరావు మాట్లాడుతూ పాతపట్నం మండలం హౌసింగ్ మంజూరులో రెండో ఫేజ్‌లో ఉందన్నారు. మండలంలో 760 పీఎంఏవై ఇళ్లు, 5 జగనన్న లే అవుట్లలో ఉన్న 796 ప్లాట్‌లకు ఇళ్లు మంజూరయ్యాయన్నారు. ఎంఈఓ సీహెచ్ మణికుమార్ మాట్లాడుతూ చాకిపల్లి గ్రామానికి ప్రభుత్వం నూతన పాఠశాలను మంజూరు చేసిందని, ఇటీవల ఇద్దరు ఉపాధ్యాయులను కేటాయించామన్నారు. ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ కళ్యాణ్ రామ్ మాట్లాడుతూ మండలంలో 48 గ్రామాల్లో కుళాయిలు మంజూరయ్యాని, 5 గ్రామాల్లో పనులు పూర్తిచేశామన్నారు. బూరగాం సర్పంచ్ బి.పుల్లాయ్ మాట్లాడుతూ వీఆర్వో పనితీరు బాగులేదని, రైతులు ఇబ్బంది పడుతున్నారన్నారు. జెడ్పీటీసీ సభ్యురాలు లింగాల ఉషారాణి, మండల ప్రత్యేకాధికారి మంచు కరుణాకరరావు, మండల సలహాదారుడు ఎం.గణపతి, తహసీల్దార్ రవిచంద్ర, ఎంపీడీఓ జయంత్ ప్రసాద్, డిప్యూటీ తహసీల్దార్ వెంకటరమణ, విద్యుత్ శాఖ ఇన్‌చార్జి ఏఈ రమేష్, ఐసీడీసీ పీఓ పార్వతి, వైస్ ఎంపీపీ ఎస్.ప్రదీప్, ఈఓపీఆర్డీ ప్రసాద్ పండా, సూపరింటెండెంట్ కె.అప్పలనాయుడు, ఏపీఎం మణిరత్నం, అంగన్‌వాడీ సూపర్‌వైజర్ సుమలత, అధికారులు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

విద్యార్థినికి అభినందన



జాహ్నవిని అభినందిస్తున్న సబ్ కలెక్టర్

సారవకోట: మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలలో చదివి 10వ తరగతి ఫలితాల్లో 590 మార్కులు సాధించిన యు.జాహ్నవిని టెక్కలి సబ్‌కలెక్టర్ రాహుల్ కుమార్ రెడ్డి తన కార్యాలయంలో మంగళవారం అభినందించారు. భవిష్యత్‌లో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని సూచించారు. డిప్యూటీ డీఈఓ జి.పగడాలమ్మ, తహసీల్దార్ ప్రవల్లికాప్రియ, ఎంఈఓ ఎం.వి.రమణ, కేజీబీవీ ఎస్ఓ శిరీష పాల్గొన్నారు.

నోట్స్, పెన్నుల అందజేత



శ్రద్ధగా చదువుకుంటున్న విద్యార్థులు

పొందూరు: స్థానిక శాఖా గ్రంథాలయంలో వేసవి శిక్షణ శిబిరంలో భాగంగా విద్యార్థులకు నోట్స్, పెన్నులను గ్రంథాలయాధికారి భాస్కర రాజా మంగళవారం అందజేశారు. విశ్వం, సౌరకుటుంబం వ్యవస్థపై అవగాహన కలిగించారు. మూడో తరగతి నుంచి ఎనిమిదో తరగతి విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంతో మేలు



మాట్లాడుతున్న సర్పంచ్ వందాన కృష్ణ

సరుబుజ్జిలి: ప్రకృతి వ్యవసాయ సాగు వల్ల కలిగే ప్రయోజనాలు గురించి రైతులకు అవగాహన ఉండాలని రావివలస సర్పంచ్ వందాన కృష్ణ తెలిపారు. ప్రకృతి వ్యవసాయ యూనిట్ సిబ్బంది ఆధ్వర్యంలో గ్రామంలో మంగళవారం అవగాహన సదస్సులు, ర్యాలీలు చేపట్టారు. నవధాన్యాలు సాగుచేసి ప్రతిఒక్కరూ వాటిని ఆహారంగా తీసుకుంటే ఆరోగ్యవంతులుగా ఉంటారని వెల్లడించారు. ప్రకృతి వ్యవసాయ టీమ్ డివిజనల్ అసిస్టెంట్ బాబాజీ, టీమ్ సభ్యులు బొంగు లలిత, రమణమ్మ పాల్గొన్నారు.

సుసరాం చెరువుకు హద్దుల గుర్తింపు



ట్రెంచ్‌లు తీయించిన అధికారులు

నరసన్నపేట: జాతీయ రహదారికి ఆనుకుని సత్యవరం గ్రామానికి వెళ్లే మార్గంలో ఉన్న సుసరాం చెరువులో ఉన్న ఆక్రమణలు తొలగించి హద్దులను రెవెన్యూ అధికారులు ఏర్పాటు చేశారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ఎఫ్‌ఎంబీ ప్రకారం ఉన్న కొలతల మేరకు హద్దులు ఏర్పాటు చేసినట్లు తహసీల్దార్ ఎ.సింహాచలం తెలిపారు. సోమ, మంగళ వారాల్లో ఈ కార్యక్రమం చేపట్టామన్నారు. ట్రెంచ్‌లు తీయించినట్లు తెలిపారు. పంచాయతీ ఈఓ సింహాద్రి నాయుడు, ఆర్‌ఐ అన్వేష్, వీఆర్వోలు ఉన్నారు.

పేదలకు వరం ఫ్యామిలీ డాక్టర్



వైద్యపరీక్షలు చేస్తున్న వైద్యాధికారి మౌనిక

హిరమండలం: గ్రామీణుల ఆరోగ్యం కోసం ప్రభుత్వం తీసుకువచ్చిన ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం పేదలకు వరమని చొర్లంగి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి సీహెచ్ మౌనిక అన్నారు. మండలంలోని కల్లట గ్రామంలో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. రోగులకు వైద్యపరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. గర్భిణులు, బాలింతలు, బీపీ, సుగర్ వ్యాధిగ్రస్తులు, మంచానికే పరిమితమైన రోగుల ఇళ్లకు వెళ్లి ఆరోగ్య పరిస్థితులు తెలుసుకుని సూచనలు, సలహాలు అందించారు. అనంతరం అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించి చిన్నారులకు ఆరోగ్య పరీక్షలు చేశారు. వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా ఘటాల అనుపోత్సవం



ఘటాల అనుపోత్సవ యాత్రలో పాల్గొన్న భక్తులు

హిరమండలం: పాతహిరమండలం గ్రామ దేవత నీలామణి అమ్మవారి ఘటాల అనుపోత్సవం మంగళవారం ఘనంగా జరిగింది. నాయుడు వంశీయులు జోగినాయుడు మాస్టర్ కుటుంబ సభ్యులు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం గ్రామస్తులు, ఉత్సవ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో ఘటాలను ఊరేగించారు. పన్నెండేళ్ల తరువాత గ్రామ దేవత పెద్ద పండగలు జరగడంతో బంధువులు, స్నేహితులతో గ్రామం జనాలతో కళకళలాడింది.

వాహనాల దారి మళ్లింపు

గ్రామ దేవత పెద్ద పండగల ముగింపు సందర్భంగా బుదవారం వాహనాలను గ్రామంలోకి ఉదయం 10 నుంచి సాయంత్రం 4 గంటల వరకు నిషేధించినట్లు ఎస్‌ఐ జి.నారాయణ స్వామి తెలిపారు. గ్రామంలోకి ఏ ఇతర వాహనాలు రాకూడదన్నారు. పాత హిరమండలం పెట్రోల్ బంకు వెనుక నుంచి (సోమా) రహదారి భూదేవి గుప్తా కల్యాణ మండపం పక్కన ఉన్న రహదారి మీదుగా వాహనాల రాకపోకలు సాగించాలన్నారు.

చందనగిరికి రహదారి సౌకర్యం కల్పిస్తాం

- సీతంపేట ఐటీడీఏ పీఓ కల్పనాకుమారి



గిరిజనులతో మాట్లాడుతున్న పీఓ కల్పనాకుమారి

మెళియాపుట్టి: మండలంలో సీతంపేట ఐటీడీఏ పీఓ కల్పనాకుమారి మంగళవారం పర్యటించారు. ఎత్తైన చందనగిరి గిరిజన గ్రామాన్ని సందర్శించారు. గిరిజనులతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. రహదారి సమస్యను త్వరితగతిన పరిష్కరిస్తామన్నారు. రూ.1.75 లక్షలతో ఆర్వోప్లాంట్ నిర్మించి శుద్ధజలాన్ని అందిస్తామన్నారు. సెల్‌టవర్ మంజూరైందని, పనులు వేగవంతం చేస్తామన్నారు. హడ్డివాడ రహదారి నిర్మిస్తామన్నారు. మండలకేంద్రంలోని ఏకలవ్య పాఠశాల పనులను పరిశీలించారు. జూన్‌లో వినియోగానికి తీసుకురావాలన్నారు. ప్రస్తుతం మెళియాపుట్టి మండలానికి సంబంధించిన ఏకలవ్య పాఠశాల పాతపట్నంలో నిర్వహించడం వల్ల ఇబ్బందులు పడుతున్నట్లు పలువురు విద్యార్థుల తల్లిదండ్రులు ఆమె దృష్టిలోకి తీసుకెళ్లారు. మండల కేంద్రంలో ఉన్న పాత తహసీల్దార్ కార్యాలయం పాడుబడిందని, దాన్ని కూల్చి వేసి ఆ ప్రదేశంలో పెట్రోల్ బంక్ నిర్మాణం చేపట్టాలని గిరిజన ఇక్యవేదిక జిల్లా కార్యదర్శి శాంతారావు కోరారు. ఈ విషయంపై కలెక్టర్‌తో మాట్లాడుతామని పీఓ అన్నారు. ఈఈ మురళి, డీఈఈ శ్రీకాంత్, తహసీల్దార్ సరోజిని, ఎంపీడీఓ చంద్రకుమారి, ఎంఈఓ దేవేంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా చెవిటమ్మ తల్లి పండగ



ఆమదాలవలస: ఘటాలతో బయల్దేరిన మెట్టక్కివలస భక్తులు

ఆమదాలవలస: ఆమదాలవలస మున్సిపాలిటీ పరిధి మెట్టక్కివలస, అక్కివలస తదితర గ్రామాల గ్రామ దేవత చెవిటమ్మతల్లి అమ్మవారి పండగలు మంగళవారం వైభవంగా నిర్వహించారు. 11 ఏళ్ల తరువాత పండగలు నిర్వహించడంతో ప్రతి ఇంట్లోనూ ఘటాలతో అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

చెవిటమ్మ తల్లిని దర్శించుకున్న స్పీకర్ దంపతులు

చెవిటమ్మ తల్లిని స్పీకర్ తమ్మినేని సీతారాం, ఆయన సతీమణి వాణి దర్శించుకున్నారు. వేదపండితులు, అమ్మవారి అర్చకులు స్పీకర్‌ను ఆహ్వానించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యులు అమ్మవారి చిత్రపటాన్ని అందజేశారు. మున్సిపల్ మాజీ ఫ్లోర్ లీడర్ బొడ్డేపల్లి రమేష్ కుమార్, మాజీ కౌన్సిలర్ బొడ్డేపల్లి అజంతా కుమారి, మాజీ వైస్ ఫ్లోర్ లీడర్ అల్లంశెట్టి ఉమామహేశ్వరరావు, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.



ఆమదాలవలస: చెవిటమ్మ తల్లి పూజల్లో పాల్గొన్న స్పీకర్ దంపతులు

బాణాం అసిరితల్లి పండగలో..

పొందూరు: మండలంలోని బాణాం గ్రామంలో అసిరితల్లి పండగ ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. స్పీకర్ తమ్మినేని సీతారాం మంగళవారం హాజరైయ్యారు. వైఎస్సార్‌సీపీ నాయకులు, మాజీ సర్పంచ్ పెద్దింటి వెంకటరవిబాబుతో కలిసి అసిరి తల్లి అమ్మవారిని, రామాలయాన్ని దర్శించారు. అనంతరం తనను ఆహ్వానించిన కుటుంబాల వారిని కలిశారు.

పౌష్టికాహారం పంపిణీ



ఎల్.ఎన్.పేట: గర్భిణులకు పౌష్టికాహారం అందిస్తున్న సత్యసాయి భక్తులు



ఆమదాలవలస రూరల్: పౌష్టికాహారం పంపిణీ చేస్తున్న సత్యసాయి సేవా సమితి సభ్యులు

ఆమదాలవలస రూరల్: గర్భిణులు పౌష్టికాహారం తీసుకోవాలని వైద్యాధికారులు కూన మీనాకుమారి, బొడ్డేపల్లి వసంత అన్నారు. మండలంలోని అక్కులపేట పీహెచ్‌సీలో సత్యసాయి సేవా సమితి అధ్వర్యంలో ఏర్పాటు చేసిన మధ్యాహ్న భోజన పథకాన్ని మంగళవారం ప్రారంభించారు. ప్రతి నెల 9వ తేదీన గర్భిణులకు వైద్య పరీక్షలు నిర్వహించడం జరుగుతుందన్నారు. సుదూర ప్రాంతాల నుంచి వచ్చిన వారికి భోజనాలు ఏర్పాటు చేయడం ఎంతో ఆనందం కలిగిస్తుందన్నారు. సమితి కన్వీనర్ ఎం.జనార్దనరావు, బి.సాయికృష్ణ, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఎల్.ఎన్.పేట: మండలంలోని లక్ష్మీనర్సుపేట ప్రభుత్వ ఆస్పత్రికి వచ్చిన గర్భిణులకు భగవాన్ సత్యసాయి భక్తులు పౌష్టికాహారం అందజేశారు. సత్యసాయి సేవాసమితి జిల్లా అధ్యక్షుడు ఆదేశాల మేరకు ఆస్పత్రికి తనిఖీలకు వచ్చిన 84 మందికి మధ్యాహ్న భోజన సదుపాయం కల్పించామని సత్యసాయి భజన మండలి సభ్యుడు ఎ.నారాయణరావు తెలిపారు. డాక్టర్ ఎస్.సునీత, వైద్య సిబ్బంది, సత్యసాయి భక్తులు పాల్గొన్నారు.

సంక్షిప్తంగా..

గ్రంథాలయానికి పుస్తకాల వితరణ

పాతపట్నం: మండలంలోని ఆర్.ఎల్.పురం గ్రామంలో ఉన్న సరస్వతి గ్రంథాలయాని రామరాజు చారిటబుల్ ట్రస్ట్ అధ్యక్షుడు పి.రామరాజు మంగళవారం పుస్తకాలను అందజేశారు. నిరుద్యోగులకు పోటీ పరీక్షలకు ఉపయోగపడే పుస్తకాలను అందజేశామన్నారు. మీనాకుమారి, దుర్గారావు, జరిత్ర, శ్యామసుందరరావు, పాఠకులు పాల్గొన్నారు.

పౌష్టికాహారంతో రక్తహీనత దూరం

హిరమండలం: పౌష్టికాహారం తీసుకుంటే రక్తహీనత దూరమవుతుందని స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారి సాయి గీత అన్నారు. పీహెచ్‌సీలో పీఎంఎంఎస్‌వై పథకంలో భాగంగా 65 మంది గర్భిణులకు మంగళవారం వైద్య తనిఖీలు నిర్వహించారు. 11 హైరిస్కు కేసులు ఉన్నట్లు గుర్తించామన్నారు. జెమ్స్ ఆస్పత్రి స్త్రీ వైద్య నిపుణులు స్వప్న, రాధిక స్కానింగ్ చేశారు. గర్భిణులకు సత్యసాయి భక్తులు ఎందవ ప్రసాద్ ఆధ్వర్యంలో మధ్యాహ్నం భోజనం ఏర్పాటు చేశారు.

వాహనాల తనిఖీ

పోలాకి: మండలంలోని పలుచోట్ల మంగళవారం పోలీసులు వాహన తనిఖీలు నిర్వహించారు. ఏఎస్‌ఐ చిరంజీవి ఆధ్వర్యంలో జడూరు, పోలాకి, పిన్నింటిపేట, ఈదులవలస జంక్షన్లలో వాహనాల తనిఖీ చేపట్టారు. రికార్డులు సరిగా లేని వాహనాలకు జరిమానాలు విధించారు. ఆటో ప్రమాదాలకు కారణమైన మితిమీరిన ప్రయాణికులు, డ్రైవర్లు మద్యం సేవించటం, సౌండ్ సిస్టమ్ వంటి వాటిని నియంత్రించేందుకు తనిఖీలు చేపడుతున్నట్లు పోలీసులు తెలిపారు.

హెచ్చరిక బోర్డు ఏర్పాటు

కొత్తూరు: మండలంలోని ఓంద్రుజోల గ్రామంలో గల సర్వే నంబర్ 23లో 2.50 ఎకరాల్లో స్థానిక తహసీల్దార్ పి.బాల ఆదేశాల మేరకు హెచ్చరిక బోర్డును వీఆర్వో హరిహరరావు, సర్వేయర్ ఉమామహేశ్వరరావు మంగళవారం ఏర్పాటు చేశారు. ప్రభుత్వ స్థలాలను ఆక్రమణలకు పాల్పడితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. ఈ స్థలం కబ్జాకు గురైందని సోమవారం నిర్వహించిన జిల్లా కలెక్టరేట్‌లో నిర్వహించిన స్పందనలో ఓంద్రుజోలకు చెందిన కొంతమంది ఇచ్చిన ఫిర్యాదు మేరకు తహసీల్దార్ స్పందించారు. ఆ స్థలంలో హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేశారు. పంచాయతీ కార్యదర్శి గవర ఢిల్లేశ్వరరావు, వైఎస్సార్‌సీపీ నాయకుడు గంధవరపు నాగేంద్ర ఉన్నారు.

భార్యపై భర్త దాడి

కొత్తూరు: మండలంలోని మాకవరం గ్రామానికి చెందిన సాద రమేష్ మద్యం తాగి భార్య కృష్ణవేణిని మంగళవారం గాయపర్చాడని ఎస్‌ఐ ఎం.గోవిందరావు తెలిపారు. నిత్యం మద్యం తాగి ఇంటికి వస్తున్న భర్తకు వ్యసనాన్ని మానుకోవాలని నిలదీయడంతో దాడి చేసినట్లు కృష్ణవేణి ఫిర్యాదులో పేర్కొంది. కృష్ణవేణి ఫిర్యాదు మేరకు భర్త రమేష్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు. గాయపడిన కృష్ణవేణికి కొత్తూరు సీహెచ్‌సీలో వైద్యం అందించారు.